క్లుప్తంగా

11న కొవ్వూరు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు: కొవ్వూరు మండల పరిషత్ పాలక వర్గ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 11వ తేదీ ఉదయం పది గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో కె.సుశీల శనివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశంలో మండలంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, శాఖల వారీగా పురోగతిపై సమీక్షిస్తామన్నారు. సభ్యులు, మండలస్థాయి అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

బీమా తక్షణం సాయం అందజేత



బీమా తక్షణ సహాయాన్ని అందిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: ఖండవల్లికి చెందిన మట్టా సత్తిబాబు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా మంజూరైన రూ.10 వేలను ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ శనివారం మృతుడి భార్య నాగలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆకుల లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కందా వెంకన్న, రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

150 మంది విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లు



కాకరపర్రు ఉన్నత పాఠశాలలో ఉచిత బస్‌పాస్‌లతో విద్యార్థులు

పెరవలి: మండలంలోని కాకరపర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులు 150 మందికి శనివారం ఉచితంగా బస్ పాస్‌లు అందజేశారు. తణుకు పట్టణానికి చెందిన నరేష్ క్లాత్ షోరూమ్ ఆర్థిక సహాయంతో వారికి ఈ బస్ పాస్‌లు అందించినట్టు ఆర్టీసీ తణుకు డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ పీఆర్వో లాల్ మాట్లాడుతూ తణుకు డిపో పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బస్‌పాస్‌లు అందిస్తున్నామని తెలిపారు. కాకరపర్రు హైస్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కొండూరి శ్రీరామచంద్రమూర్తి, పీడీ సుందర జేమ్స్, డిపో ఉద్యోగి కె.సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 'శెట్టిపల్లి'



నల్లజర్ల: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి శివనాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఉత్తర్వులు జారీ చేసినట్టు శివనాగరాజు శనివారం తెలిపారు. శివనాగరాజు గతంలో ఆరేళ్లపాటు బీజేపీ నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడి పని చేశారు. గతేడాదిగా ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. రెండున్నరేళ్లుగా జిల్లా ఉపాధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

కొవ్వూరు: మండలంలోని కాపవరానికి చెందిన మహ్మద్ అజిగిరి బేగం అనే వివాహిత అదృశ్యమైంది. విజయవాడ వెళ్లి వస్తానని ఈ నెల 1న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన ఆమె ఇంత వరకూ తిరిగి రాలేదు. దీనిపై ఆమె భర్త మహ్మద్ రహ్మతుల్లాఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు.

దళిత సేన ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్

ఉండ్రాజవరం: ఆంధ్రప్రదేశ్ దళిత సేన ప్రధాన కార్యదర్శిగా బండి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు విపర్తి ప్రసాద్ చేతుల మీదుగా శనివారం చంద్రశేఖర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు.

సేంద్రియ కూరగాయల విక్రయ కేంద్రం ప్రారంభం

నల్లజర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం ఉదయం ప్రారంభించారు. కూరగాయలతో పాటు విత్తనాలు, బియ్యాన్ని విక్రయించే ఏర్పాటు చేశారు. సేంద్రియ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని అన్ని గ్రామాల్లో ఈ తరహా స్టాల్స్ ఏర్పాటు చేస్తే మంచిదని ఎమ్మెల్యే సూచించారు. సేంద్రియ సాగు మాస్టర్ ట్రైనర్ సోమిశెట్టి శ్రీనివాస్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు కనకదుర్గ, ముత్యాలు, కోటేశ్వరి, ఐసీఆర్‌పీలు తాడిగడప మనోహర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి మండలం లక్ష్మీపురం వైద్యశిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ఉండ్రాజవరం మండలం మోర్తలో రోగుల మెడికల్ రిపోర్టులు పరిశీలిస్తున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నిడదవోలు మండలం మునిపల్లిలో రోగులకు మందులు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో మందుల పంపిణీ

ప్రజారోగ్యమే పరమావధిగా..

- హోం మంత్రి తానేటి వనిత
- ఆరు గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు
- వేలాది రోగులకు ఉన్నత వైద్యం



కొవ్వూరు మండలం వేములూరు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఉచిత మందుల కిట్ అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాష్ట్రంలో ప్రజారోగ్యమే పరమావధిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయి. మండలంలోని వేములూరులో శనివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని మంత్రి వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. ముందుగా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి వనిత పరిశీలించారు. వైద్య సేవల అనంతరం ఉచిత మందుల కిట్లను మంత్రి చేతుల మీదుగా పలువురు రోగులకు అందజేశారు. శిబిరంలో 450 మందికి వైద్య సేవలు అందించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, కొవ్వూరు ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.ధర్మరాజు, బి.శ్రీనివాసరావు, గైనకాలజిస్టు శ్రావ్య, ఎముకల వైద్య నిపుణుడు చెల్లారావు, వైద్యులు హరిశ్చంద్ర, దివ్య, ప్రణీత, నిషాంత్ రోగులకు సేవలు అందించారు.

లక్ష్మీపురంలో 375 మంది రోగులకు..

దేవరపల్లి: అందరికీ ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ దోనెల్లి ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇప్పటి వరకూ నియోజకవర్గంలో 20 వైద్య శిబిరాలు నిర్వహించినట్టు ఆయన చెప్పారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల వార్డులు, ఐసీడీఎస్ స్టాల్స్‌ను ఎమ్మెల్యే తలారి పరిశీలించారు. వైద్యులు, రోగులతో ఎమ్మెల్యే ఆయన మాట్లాడి వారి ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్నారు. శిబిరంలో 375 మంది రోగులకు వైద్యులు సేలు అందించారు. వారిలో 10 మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైఎస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, పార్టీ మహిళా కన్వీనర్ కడలి హైమావతి, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మోర్తలో 494 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త ఉన్నత పాఠశాల వద్ద సర్పంచ్ చిటికెన సుజని ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పరిశీలించి, వైద్య పరీక్షల నిర్వహణ తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిబరంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషాదేవి ఆధ్వర్యంలో మోహన్ హనుమాన్ (ఆర్థోపెడిక్), ఇర్ఫాన్ (జనరల్ మెడిసిన్), కె.రామారావు (ఈఎన్‌టీ) 494 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 12 మందిని కంటి, నలుగురిని ఆర్థోపెడిక్, ముగ్గురిని చెవి, ముక్కు ఆపరేషన్ల నిమిత్తం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్ర, ఉప సర్పంచ్ దాపర్తి రాం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లిలో 427 మందికి..

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ వెలగన నరేష్ ప్రారంభించారు. కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.హేమరాజు పర్యవేక్షణలో వైద్య నిపుణులు 427 మంది రోగులను పరీక్షించారు. వారిలో 16 మందిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొర్లపాటి మోహన్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొమ్మన హరీష్, యూత్ అధ్యక్షుడు నామాల బాబీ, ఎంపీడీఓ పి.శామ్యూల్, ఈఓపీఆర్డీ రత్నమాల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో 320 మందికి..

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ సందర్శించారు. వైద్యాధికారులు రమణ నాయక్, కరిష్మా తదితరులు శిబిరానికి హాజరైన 320 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు రావిపాటి లక్ష్మణరావు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో సీహెచ్ బాలా మణి, పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో 530 మందికి..

నల్లజర్ల: నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగన్నాథపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పంచాయతీ సర్పంచ్ చెల్లారి రామ శ్రీనివాస్ ప్రారంభించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన పోషకాహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించారు. ఈ శిబిరంలో 530 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. వారిలో 47 మందిని వివిధ ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. వైద్యులు భార్గవి, ప్రణతి, గంగాధరావు, సిరాజుద్దీన్‌లు రోగులకు సేవలు అందించారు. హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్, డాక్టర్స్ రూమ్స్, మందుల డెస్క్ వంటివి ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కిశోర్ కుమార్, ఎంపీడీఓ రాజశేఖరం, ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల రాజారావు, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, బుంగా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- ఐ.పంగిడిలో గడప గడపకూ..



ఐ.పంగిడిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికీ లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో నాలుగో రోజు శనివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులతో కలసి మంత్రి ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, ఐ. పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి వెంకట ఫణికృష్ణారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోనాల భవాణి, కామన రత్నాజీ, మాజీ సర్పంచ్ కోమటి కృష్ణంరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, పోసిన శ్రీకృష్ణదేవ రాయులు, కంచుమర్తి బాలశంకరం పంతులు పాల్గొన్నారు.

102 మందికి ఆయుర్వేద వైద్యం

నిడదవోలు: స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో రోటరీ సభ్యుడు ఉప్పులూరి వీరభద్రరావు ఆర్థిక సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. చర్మ, కీళ్ల నొప్పులు, శ్వాస సంబంధ, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న 102 మందిని ఈ శిబిరంలో వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, డాక్టర్ శ్రీవిద్య, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటుపల్లి శివ కుమార్, కాళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నాడి తెలిసిన వ్యక్తి జగన్

- అందుకే ఆంధ్రాకు మళ్లీ ఆయనే కావాలి
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి

గోపాలపురం: రాష్ట్ర ప్రజల గుండె చప్పుడు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అందుకే ఆంధ్రాకు మళ్లీ జగనే కావాలి అని ప్రజలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' అనే అంశంపై మండల స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమైక్య శిక్షణ సమావేశం నిర్వహించారు. శనివారం గోపాలపురంలోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేని అభివృద్ధిని, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రా ప్రజలకు అందించారన్నారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో కుట్రలు, కుంత్రాలకు విపక్షాలు తెర లేపుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు వాటిని సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వలంటీర్లు, గృహ సారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరారావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మండల మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ, సర్పంచులు పఠాన్ అన్సర్ బాషా, మల్లిపూడి అచ్చిబాబు, యండపల్లి శేఖర్ బాబు, నాయకులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

మెప్మా ద్వారా మహిళలకు జీవనోపాధి

- మున్సిపల్ కమిషనర్ పద్మావతి
- పట్టణంలో మెప్మా మార్కెట్ ప్రారంభం



మెప్మా మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ పద్మావతి

నిడదవోలు: స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధికి మెప్మా ద్వారా పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న మార్కెట్లు ఎంతగానో దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంత మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా మార్కెట్‌ను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించి వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు కుటుంబ పోషణకు యూనిట్లు పెట్టుకుంటే, వారు తయారు చేసే ఉత్పత్తులకు మెప్మా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, అహ్మదున్నీసా బేగం, మెప్మా సిటీ మేనేజర్ శివప్రసాద్, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

- నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం
- హాజరైన గోపాలపురం ఎమ్మెల్యే తలారి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: మండలంలో వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గళమెత్తారు. శనివారం నిర్వహించిన నల్లజర్ల మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షత వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆక్రమణకు గురైన చాదరాశిగుంట సచివాలయానికి వెళ్లే మార్గాన్ని ఆక్రమణల నుంచి తొలగించాలని ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు నాయుడు రామకృష్ణ కోరారు. నల్లజర్ల శశి స్కూల్ పక్కనే ఉన్న ఎస్సీ పేటలో బోరు వేయించాలని సర్పంచ్ పల్లి జ్యోతి సభ దృష్టికి తీసుకొచ్చారు. పుల్లలపాడులో సీసీ రహదారులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ సూర్యచంద్రరావు కోరారు. మారెళ్లమూడి ఆర్బీకేలో టాయిలెట్ నిర్మించాలని ప్రగడ వెంకటేశ్వరి విజ్ఞప్తి చేశారు. పోతవరంలో విద్యుత్తు స్తంభాలు వేయించాలని సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు పాపానాగేశ్వరరావు అధికారులను కోరారు. శింగరాజుపాలెంలో తాడిపూడి కాలువ గట్టును కొల్లగొట్టేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గద్దే బాల గంగాధర తిలక్ కోరారు. పల్లంగా ఉన్న అనంతపల్లి ఎస్సీ పేటలోని రహదారుల స్థానంలో మెరకగా సీసీ రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎంపీటీసీ సభ్యుడు యడ్లపల్లి మార్త కోరారు. ప్రకాశరావుపాలెంలో జగనన్న కాలనీకి నీటి వసతి కల్పించాలని సర్పంచ్ విక్టర్ కోరారు. ఆవపాడులో విద్యుత్తు స్తంభాలను మార్చాలని సర్పంచ్ సత్యనారాయణ, నబీపేటలో స్తంభాలు వేయాలని సర్పంచ్ గోతం సత్యలక్ష్మి కోరారు. ఈ సమస్యలపై ఆయా శాఖల అధికారులు వివరణ ఇచ్చారు.

నియోజకవర్గానికే ఎక్కువ సబ్ ప్లాన్ నిధులు

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ మిగతా నియోజకవర్గాల కంటే గోపాలపురం నియోజకవర్గంలోనే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఎక్కువగా ఖర్చు చేశామన్నారు. శ్మశానాలు లేని రెండు వేల లోపు జనాభా గల గ్రామాలకు అరెకరం, అంతకు పైబడిన జనాభా ఉన్న గ్రామాలకు ఎకరం చొప్పున స్థలాలను కేటాయించనున్నట్టు చెప్పారు. మండలంలో చేపట్టిన ప్రభుత్వ భవనాలు 90 శాతం పూర్తయినట్టు చెప్పారు. నబీపేట, మారెళ్లమూడి, తిమ్మన్నపాలెం, తూర్పు చోడవరం గ్రామాలకు విద్యుత్తు సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని ప్రకటించారు. స్థలాలు కేటాయిస్తే త్వరలో నిర్మాణాలు ప్రారంభిస్తారన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు ఇవ్వాలని ఎంపీడీఓను ఆదేశించారు. సమావేశంలో నల్లజర్ల, పోతవరం సొసైటీల అధ్యక్షులు కారుమంచి రమేష్ , పెండ్యాల హరే రామకృష్ణ, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, ఎంపీడీఓ రాజశేఖరం, తహసీల్దార్ కిశోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

నిడదవోలు: న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం చట్టం చేయాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.రవికుమార్ కోరారు. ఇండియన్ లాయర్స్ యూనియన్ నిడదవోలు యూనిట్ మహాసభ ములగాల రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. నిడదవోలు బార్ అసోసియేషన్ హాల్లో శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో రవికుమార్ మాట్లాడారు. ఇటీవల న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నందున వారికి రక్షణ కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కామన్ మునిస్వామి, జిల్లా కమిటీ సభ్యులు గౌర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల చొప్పున ఉపకార వేతనం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పీవీపీ లక్ష్మి, న్యాయవాదులు ఎండి మోహిబాబు, పి రాజబాబు, సతీష్‌కుమార్, ఆర్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాళ్లపూడి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై కె.వెంకట రమణ కథనం ప్రకారం.. కొవ్వూరు శ్రీరామ్ కాలనీకి చెందిన రాచర్ల నవీన్, జువ్వల కిషోర్ (33) సగ్గొండ ఆంధ్రా షుగర్స్‌లో లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ శనివారం కొవ్వూరు నుంచి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. బైక్‌ను కిషోర్ నడుపుతున్నాడు. పైడిమెట్ట సెంటర్‌కు వచ్చేసరికి మోటార్ సైకిల్ ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కనే ఉన్న ఇనుప బోర్డును ఢీకొంది. నవీన్ రోడ్డుపై పడిపోయి స్వల్పంగా గాయపడ్డాడు. బైక్‌తో సహా కిషోర్ పక్కనే ఉన్న పంట బోదెలో పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. కిషోర్ అప్పటికే మృతి చెందాడు. నవీన్ ఫిర్యాదు మేరకు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట రమణ తెలిపారు.

ఉండ్రాజవరం స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



ఉండ్రాజవరం స్టేషన్‌లో ఎస్పీ జగదీశ్

ఉండ్రాజవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పి.జగదీశ్ శనివారం సందర్శించారు. మండలంలో నేరాల నమోదు గురించి ఎస్సై కె.రామారావును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సిబ్బందికి సూచించారు. కొవ్వూరు డీఎస్పీ వర్మ, సీఐ కె. వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

10 వరకూ దారవరం రైల్వే గేట్ మూసివేత

చాగల్లు: మండలంలోని దారవరం రైల్వే గేట్ వద్ద మరమ్మతుల నిమిత్తం ఈ నెల 10వ తేదీ వరకూ ఆ రైల్వే గేట్‌ను మూసి వేసినట్టు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. గేట్ ఉన్న ప్రదేశంలో కుంగిపోయిన ట్రాక్‌లను ఎత్తు చేస్తున్నామని, పాడైన కాంక్రీట్ స్లీపర్స్‌ను తొలగించి కొత్తవి వేస్తున్నట్టు అధికారులు వివరించారు. మరమ్మతుల కోసం శుక్రవారం నుంచే దారవరం రైల్వే గేట్‌ను అధికారులు మూసివేశారు. దాంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గేట్ మూసివేతపై ముందుగా సమాచారం ఇవ్వకపోవడంపై సమీప దారవరం, చంద్రవరం, మల్లవరం, మార్కొండపాడు గ్రామాల ప్రజలు శుక్ర, శనివారాల్లో ఇబ్బంది పడ్డారు.

రాజమహేంద్రవరానికి షటిల్ సర్వీసులు నడపాలి

కొవ్వూరు: మరమ్మతుల కోసం రోడ్డు కం రైల్ వంతెనను మూసి వేసినందున కొవ్వూరు– రాజమహేంద్రవరాల మధ్య షటిల్ బస్సు సర్వీసులు నడపాలంటూ సీపీఎం నాయకులు శనివారం ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొవ్వూరు పరిసర ప్రాంతాల నుంచి నిత్యం రాజమహేంద్రవరానికి కళాశాలలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, వైద్యం నిమిత్తం ఆసుపత్రులకు వెళ్లే రోగులు సరైన రవాణా సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి దగ్గు రాధాకృష్ణ, నాయకుడు పడాల గంగాధరరావు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.